# ఇంటర్వ్యూ

"అలాకూర్చో!" అన్నాడాయన కుర్చీ చూపుతూ.

ఆ స్వరంలో ధ్వనించినది ఆజ్ఞో, విజ్ఞాపనో అర్థం గాలేదు అప్పారావుకు.

కూర్చున్నాడు అప్పారావు మార్పలుకకుండా.

అప్పారావును తేరిపార జూచాడాయన.

తలొంచుకున్నాడు అప్పారావు, ఆ చూపుల్ని తట్టుకోలేక.

అదిచూచి చిరునవ్వు నవ్వేడాయన.

ఆ సిగ్గుపడటం అత్తవారింట్లో అడుగెట్టబోతున్న కొత్త పెళ్ళికూతురును గుర్తుకు తెచ్చిందాయనకు.

"నీ పేరు?"

ప్రశ్నించేడాయన.

సందేహించేడు అప్పారావు.

క్షణమాగే డాయన.

క్షణమాలస్యం చేశాడు అప్పారావు.

"ఊఁ! నీ పేరు ?" రెట్టించాడాయన.

తడబడ్డాడు అప్పారావు.

"అప్లికేషన్‌లోనే వ్రాశాను గదండీ!" అన్నాడు నోరు పెగల్చుకుని.

జేబురుమాలు నోటికడ్డం పెట్టుకున్నా డాయన.

"ఏమని వ్రాశావు?"

"నా పేరు అప్పారావు అనే వ్రాశానండీ!"

ఆ క్షణంలో అప్పారావు కంఠంలో ధ్వనించిన నిజాయితీ ఆయన్నంతగా ఆకర్షించలేదు.

"అలాగా! నీ వెప్పుడూ అబద్దాలు వ్రాయవా ఏమిటి?" ప్రశ్నించాడాయన వింతగా అప్పారావు కళ్ళలోకి చూస్తూ.

"అవునండీ! వ్రాయకపోవడమేగాదు. అబద్ధాలాడను కూడాను?" అన్నాడు అప్పారావు ఉత్సాహంగా.

"అనటానికి, వ్రాయటానికీ తేడా ఉందా?" అన్నాడాయన సాగదీస్తూ.

"లేకేమండీ! చేత్తో రాస్తారు, నోటితో ఆడతారు" జవాబిచ్చాడు అప్పారావు.

"అదేమిటి? కాళ్ళతోనూ, చేతులోనూఆడటం చూశానే గాని, నోటితో ఆడటం గురించి విననన్నా లేదే!" అన్నాడాయన ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ.

"కాదండీ! కాళ్ళతోనూ, చేతుల్తోనూ ఆటలాడు తారు; నోటితో మాటలాడుతారు" వివరించాడు అప్పారావు.

'అలాగా' అన్నాడాయన.

ఆ క్షణంలో అప్పారావు కళ్ళలో కరీక్షల్లో చిక్కు లెక్కను సునాయాసంగా చేసేసిన విద్యార్థిలో రేగేఉత్సాహం లాంటిది కొట్టవచ్చినట్లు స్పష్టంగా పొడగట్టిందాయనకు.

"బుద్ధిమంతుడవే!" అన్నాడాయన.

ఏ అర్థంతో ఆయనామాటన్నదీ అర్థం గాలేదు అప్పా రావుకు.

"అందరూ అలాగే అంటారండీ!" అన్నాడు అప్పా రావు క్షణమాగి.

"ఏమనీ?" కళ్లు చిట్లించేడాయన.

"ఇందాక మీరన్నట్లేనండీ! కాని......"

"ఊఁ......కానీ!"

"కాని, మా మామయ్య మాత్రం తిడుతుంటాడండీ అస్తమానూ!"

"అలాగా! ఎందుకు?"

"నాకు అబద్ధాలాడటం చేతగాదట. బ్రతకటం అసలే చేతగాదట — అందుకని."

"'నిక్షేపంలాంటి ఉద్యోగం చేజేతులా పోగొట్టు కున్నాడు ఇంకేలా బ్రతుకుతాడు' అంటాడండీ మా మామయ్య."

"అయితే నువ్వింతకుముందేమన్నా ఉద్యోగం చేశావా?" అన్నాడాయన ఆశ్చర్యపోతూ.

"అవునండీ చేశాను" అన్నాడు సగర్వంగా అప్పారావు.

"మరెందుకు పోయిందా ఉద్యోగం?"

అనుమానంగా చూశాడాయన అప్పారావు కళ్ళలోకి.

గొంతు సవరించుకుంటూ జవాబిచ్చాడు అప్పారావు.

"మేనేజరు పొమ్మన్నాడండీ!"

"ఎవరా మేనేజరు?"

"పాన్‌లో పుగాకు వేసుకు నములుతుంటాడే. ఆయనేనండీ!"

అప్పారావు కళ్ళలో రోషం పల్చగా తొంగిచూసింది.

"అలాగా! ఆయనెవరికి మేనేజరు?" ప్రశ్నించాడాయన.

ప్రశ్నించి జేబురుమాలు మళ్ళీ నోటికడ్డం పెట్టుకున్నాడాయన.

"నే నింతకుముందు ఉద్యోగం చేసిన కంపెనీ మేనేజరండీ" జవాబిచ్చాడు అప్పారావు.

"మరి ఆయనెందుకు పొమ్మన్నాడు?"

"నే నెందుకూ పనికిరానట, అందుకని."

"ఏం, నీకే పనీ చేతగాదా?"

"చేతగాకేమండీ! అసలు నాకు చేతగాని పనే లేదంటాడు మా మామయ్య."

"మరి... ?"

"మరే. వాళ్ళు లెక్కల్లో అబద్ధాలు వ్రాయమన్నారు?"

"అయితే ?"

"నేను వ్రాయనన్నాను."

"అప్పుడు...?"

"నువ్వు మా కక్కర్లేదు పొమ్మన్నారు."

"మరి నువ్వు అబద్ధాలాడవా ?"

ఉలిక్కిపడ్డాడు అప్పారావు.

"అబద్ధాలా ! ఆడటమేగాదు. వ్రాయనుకూడానండీ." అన్నాడు ధీమాగా.

ఆ క్షణంలో మెరుస్తున్న అప్పారావు కళ్ళలోని వింత కాంతిని గమనించలే దాయన.

"అయితే నువ్వింక దయచెయ్యవచ్చు." అన్నా డాయన జేబురుమాలు నోటికడ్డంతీసి.

"ఎక్కడికండీ?" అడిగేడు అప్పారావు.

"అక్కడికి."

వ్రేలెత్తి చూపించేడాయన.

వెనక్కి తిరిగి చూసిన అప్పారావుకు స్ప్రింగ్‌డోర్స్ క్రిందుగా వరండా, ఆ వరండాలో ఇంటర్వ్యూకోసం ఎదురు జూస్తూ కూర్చున్న వాళ్ళ తాలూకు పదమూడు పాంట్లూ, మరిన్ని జతల బూట్లూ, రకారకాలవీ అగుపించాయి.

"ఎందుకండీ ?" ప్రశ్నించాడు అప్పారావు తెల్ల బోతూ.

"ఎందుకేమిటి ? మీ యింటికి వెళ్ళడానికి" తీక్ష ణంగా జవాబిచ్చే డాయన.

"ఇప్పుడు మా యింటి కెందుకండీ ?" అడిగేడు అప్పా రావు ఆశ్చర్యపోతూ.

"మరిక్కడ కూర్చుని ఏం చేద్దామని నీ ఉద్దేశ్యం?" మండిపడ్డాడాయన.

"ఉద్యోగం చేద్దామనండీ!" వినయంగా ప్రత్యుత్తర మిచ్చేడు అప్పారావు.

"నీ కిక్కడ ఉద్యోగమేమీ లేదు."

ఆయన వాక్కు ఉక్కుగుండులా దూసుకుపోయింది అప్పారావు చెవుల్లోంచి.

బిత్తరపొయ్యేడు అప్పారావు.

"మీ ఆఫీసులో ఓ ఉద్యోగం ఖాళీగా ఉందని ప్రక టిస్తేనే గదాండి నేనిలా వచ్చింది" అన్నాడు అప్పారావు తడబడుతూ.

"మా కంపెనీ దివాలా తియ్యాలని నీ ఉద్దేశ్యమా?" ప్రశ్నించాడాయన.

"ఎబ్బెబ్బే!" నసిగాడు అప్పారావు.

"అబ్బాయ్; మేం వ్యాపారం చేసుకొనేవాళ్ళం. మాకు నీబోటి హరిశ్చంద్రులుగాదు కావలసింది" నెమ్మదిగా వివరించా డాయన.

"అవునండీ. ఆ సంగతి మా మామయ్యకూడా చెప్పా డండీ" వంతపలికాడు అప్పారావు.

"ఏ సంగతి?" ప్రశ్నించాడాయన.

"మీరు చెప్పినట్లు వినాలనీ, ఉద్యోగం జాగ్రత్తగా చూసుకోవాలనీ చెప్పేడండీ మా మామయ్య!"

"మరి అబద్ధాలాడ నంటుంటివిగా!" విసుక్కున్నాడాయన.

విసుక్కుంటూనే స్ప్రింగ్ డోర్సు క్రిందుగా కని పిస్తున్న పదమూడు పాంట్లనూ, మరన్ని జతల బూట్లనూ పరికించి నొసలు చిట్లించేడు.

"ఇకమీదట అదేం లేదండీ! మీరు చెప్పినట్లు చేస్తాను!" అన్నాడు అప్పారావు.

అప్పారావు వినయంగా అన్న ఆ మాటలు విశ్రృతంగా ధ్వనించే యాయనకు!

"సరే. నువ్వేం ప్యాసయ్యావు?" తుగామూగి ప్రశ్నించేడాయన.

"మెట్రిక్ చదివానండీ!" జవాబిచ్చాడు అప్పారావు.

"ప్యాసయ్యావా?"

"ప్యాసవుతానండీ"

"ఏం, తప్పావా?"

"మళ్ళీ మొన్న సెప్టెంబరుకు వెళ్ళానుగదాండీ! ఈసారి తప్పక ప్యాసవుతానంటున్నాడండీ మా మామయ్య"

ఈసారి మరింత గట్టిగా విసుక్కున్నాడాయన.

విసుక్కుంటూనే అప్పారావు కళ్ళల్లోకి చూశాడు.

చూసి కొంచెం శాంతించాడు.

"దయచెయ్యి" అన్నాడాయన క్షణమాగి.

"ఎక్కడికండీ?" అడిగాడు అప్పారావు.

వ్రేలెత్తి చూపించాడాయన.

అటు చూసిన అప్పారావుకు స్ప్రింగ్ డోర్స్ క్రిందుగా వరండా, ఆ వరండాలోని పదమూడు పాంట్లూ, మరిన్ని జతల బూట్లూ రకరకాలవి అగుపించాయి.

"ఎందుకండీ!" ప్రశ్నించేడు అప్పారావు.

"ఎందుకంటే, అక్కడ పదముగ్గురు గ్రాడ్యుయేట్లు ఎదురుజూస్తూ కూర్చున్నారు గనుక!" జవాబిచ్చాడాయ శాంతంగా.

ఆయన మాటల్లోని ఆంతర్యం అంతుచిక్కలేదు అప్పా రావుకు.

"ఆర్డరు ఇప్పించండి వెళ్తాను" అన్నాడు అప్పారావు

"ఏం ఆర్డరు?" గద్దించేడాయన.

"ఉద్యోగపు ఆర్డరండీ! అది లేకుండా వెళ్తే తిడతా డండీ మా మామయ్య!" జవాబిచ్చాడు అప్పారావు.

"అయితే గంగలో దూకండి!" మండిపడ్డాడాయన.

"ఎవరండీ?" అయోమయంగా చూశాడు అప్పారావు.

"నువ్వూ, మీ మామయ్యాను!" గద్దించేడాయన లేస్తూ.

"అవునండీ! మా మామయ్యకూడా అలాగే అన్నా డండీ!" వంతపలికాడు అప్పారావు.

తెల్లబోయాడాయన.

"ఏమని ప్రశ్నించేడాయన".

"ఇందాక మీరన్నట్లేనండీ!"

"అంటే"

"ఇందాక నేను వచ్చేముందు మా మామయ్య అలాగే అన్నాడండీ!"

"ఎలాగని...?"

"నీకెందుకు నువ్వు ఇంటర్వ్యూకి వెళ్ళరా అబ్బాయ్! నేను చెప్పానుగా. నా మాట అంత తేలిగ్గా తీసెయ్యడులే. అంతపనీ జరిగితే ఆ వెధవని గంగలో ముంచుతాను." అన్నాడండీ.

"ఎవడా మామయ్య" ఆగ్రహంతో, నిలువెల్ల వణికిపోతూ గర్జించాడాయన.

"అలాగంటారేమండీ? మీరు బాగా ఎరుగుదురట గదండీ."

"నేనా"

"అవునండీ. నిన్న ఉదయం మీకు ఫోనుచేశాడు కూడాను. ఆయన్నే ఎరగరా?" అన్నాడు అప్పారావు సందేహంగా ఆయన వంక చూస్తూ.

షాక్ తిన్నవాడిలా ఉలిక్కిపడి కాలింగ్‌బెల్ నొక్కబోతున్నవాడల్లా అమాంతం కుర్చీలో కూలబడ్డాడాయన!

"ఆయనా మీ మామయ్య!" కంపిస్తున్న స్వరంతో ఆయనన్న ఆ మాట అప్పారావు చెవిదాకా వెళ్ళలేదు.

క్షణమాగి టేబుల్ మీాదున్న డైరీలో తానంతకు ముందు వ్రాసుకున్న నోట్ చదువుకుని తలెత్తి అప్పారావు వంక చూశాడాయన!

అసలే తెల్లగా ఉన్న ఆయన మొహం ఆ క్షణంలో మరింత తెల్లబడటానికి హేతువేమిటో తోచలేదు అప్పారావుకు.

కాలింగ్ బెల్ మ్రోగించాడాయన.

ఉలిక్కిపడ్డాడు అప్పారావు.

బంట్రోతు వెంట మరో గదిలోకి వెళ్ళిన అప్పారావు కొద్ది నిమిషాల తర్వాత ఆర్డరు కాగితం మడిచి జేబులో పెట్టుకుంటూ ఉత్సాహంగా వరండాలోకి వచ్చాడు.

వరండాలోకి వచ్చిన అప్పారావుకు అంతకు ముందు అక్కడ కూర్చున్న వాళ్ళలో పన్నెండుగురే అగుపించారు.

పదమూడోవాడు తనంతకుముందు కూర్చున్న కుర్చీలో ఆ ఆఫీసరు కభిముఖంగా వృధా కంఠశోష పడుతూ కూర్చునున్న సంగతి తెలీదు అప్పారావుకు.

★